క్లుప్తంగా

వైఎస్సార్ ఘాట్ వద్ద చింతలపూడి నివాళి



గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య వైఎస్సార్ ఘాట్ వద్ద గురువారం నివాళులర్పించారు. గురువారం కడప వెళ్లిన ఆయన పులివెందులలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి నివాళులర్పించారు. - గాజువాక

6, 7న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

ఉక్కునగరం: స్థానిక సృష్టి వరల్డ్ పాఠశాలలో ఈ నెల 6, 7న 'ప్రతి సృష్టి' పేరిట సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని పాఠశాల డైరెక్టర్ పి.సుశీల రాణి తెలిపారు. పాఠశాల కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ థింకింగ్ క్లాస్ రూమ్ తరగతుల్లో భాగంగా 1800 మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు ప్రదర్శిస్తారన్నారు. పాఠశాల ఈడీ కె.మేఘన మాట్లాడుతూ భారీ డ్రాగన్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్ ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు, ప్రిన్సిపాల్ ఈ.చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



శీలానగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని వికాస్ కళాశాల వద్ద నుంచి ఆటోనగర్ వరకు సర్వీసు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గురువారం జరుగుతున్న పనులను వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పర్యవేక్షించారు. రూ.40 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నేలపాటి సత్యవతి, ఈటి సురేష్, సయ్యద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సామాజిక చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 7న విశాఖ నగరంలో నిర్వహించనున్న బీసీ సామాజిక చైతన్య సభ పోస్టర్‌ను ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్ర యాదవ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాజువాక కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులాలకు చెందిన వారంతా తమ కుటుంబ సభ్యులతో సహా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు కిలపర్తి సత్యనారాయణ, మణ్యం శ్రీనివాస్, బొండా ఎల్లాజీరావు, లక్కరాజు సోంబాబు, గౌరీ శంకరరావు, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- అందుకోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- విద్య, వైద్యానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు



కణితిలో జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, తదితరులు



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 68వ వార్డు హరిజన జగ్గయ్యపాలెం సచివాలయం పరిధి చిన అక్కిరెడ్డిపాలెం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశ పెట్టారన్నారు. విద్య, వైద్య రంగంలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారుతున్న తరుణంలో కోట్లాది రూపాయల వ్యయంతో కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి ఖరీదైన వైద్య పరీక్షలతోపాటు 165 రకాల నాణ్యమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రజల చెంతకే వైద్యం అందేలా వైద్య సిబ్బందిని ప్రతీ ఇంటికీ పంపిస్తున్నారని కొనియాడారు.

ఆరోగ్య శ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపుతో పేదలకు మేలు

వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ పేద ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకూడదనే తలంపుతో ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భరోసా కల్పించారన్నారు. పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్న గొప్ప నాయకుడని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధితోపాటు విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 68వ వార్డు పరిధిలో 412 మందికి వైద్య సేవలు అందించామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.ప్రియాంక తెలిపారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మహరాజ్, గైనికాలజిస్ట్ డాక్టర్ ఆర్.పద్మ శ్రీ,, డెంటల్ వైద్యులు డాక్టర్ జైనాబ్, డాక్టర్ జె.వరలక్ష్మి, పీహెచ్‌సీ, సచివాలయం ఏఎన్‌ఎంలు, సచివాలయాల కార్యదర్శులు సేవలు అందించారని తెలిపారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన్ రాణి, ఎంఎమ్‌హెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నాయకులు గొంతిన సత్యవతి, నేలపాటి సత్యవతి, ఈటి సురేష్, సయ్యద్ హుస్సేన్, శశిభూషణరావు, శ్రీనివాస రెడ్డి, గాజువాక పీహెచ్‌సీ అధికారి నాగప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాష్ట్రంలో దేశం గర్వించే వైద్య విధానం

కూర్మన్నపాలెం: దేశం గర్వించదగ్గ వైద్య విధానం రాష్ట్రంలో అమలవుతోందని, ఇందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిదర్శనమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ రూపంలో పేదలకు మేలు చేస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ సమూల మార్పులు చేసి వైద్యారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడం గొప్ప విషయమన్నారు. గాజువాక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు(చందు) మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని మహోద్యమంలా అందిస్తూ ప్రజల ఆరోగ్యప్రదాతగా సీఎం జగన్ నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

300 మందికి పరీక్షలు

శిబిరంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ స్వరూపరాణిలతో పాటు మరో నలుగురు వైద్యులు సేవలు అందించారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు సుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులు అందజేశారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు.



శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య సేవలు బాగున్నాయి



బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడానికి వచ్చా. వైద్యులు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలు మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. – ఎస్.రాజేశ్వరి, అక్కిరెడ్డిపాలెం

స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించారు



తరచూ జ్వరం, గొంతు నొప్పి వస్తుండటంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నా. నిపుణులైన వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు తమలాంటి వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటాయి. – తెంటు చంద్రశేఖర్, డెయిరీ కాలనీ, అక్కిరెడ్డిపాలెం

చెంతనే వైద్యం.. చాలా బాగుంది..



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు చాలా బాగున్నాయి. దగ్గు ఆయాసంతో చాలా ఇబ్బందిపడుతున్నా. ఈ శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేసిన అనంతరం స్పెషలిస్ట్ వైద్యులు మందులు ఇచ్చారు. సీఎం జగన్ మా ఇంటి వద్దకే వైద్యులను పంపించి ఉచితంగా సేవలు అందించడం చాలా బాగుంది. – యల్లా సింహాచలం, దువ్వాడ

ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం



నడుము, తల నొప్పితో బాధపడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం చేయించుకున్నాను. గతంలో జరిగిన తొలి విడతలో కూడా వైద్యం పరీక్షలు చేయించుకున్నాను. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందించడంతో పాటు మందులు కూడా ఇచ్చారు. పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. – గిరి రాధమ్మ, కణితి గవరవీధి

చిరస్మరణీయుడు ఆడారి తులసీరావు

అక్కిరెడ్డిపాలెం: రైతు బాంధవుడు, ఆంధ్రా కురియన్, విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ స్వర్గీయ ఆడారి తులసీరావు చిరస్మరణీయుడని పలువురు కొనియాడారు. ఆయన ప్రథమ వర్ధంతిని విశాఖ డెయిరీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డెయిరీ అధికారులు మాట్లాడుతూ లక్షలాది మంది పాడి రైతుల కుటుంబ సభ్యుల హృదయాల్లో ఎప్పటికీ తులసీరావు దైవంలా గుడి కట్టుకొని నిలిచిపోతారన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, పలువురు విశాఖ డెయిరీ డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



తులసీరావు వర్ధంతి కార్యక్రమంలో పిల్లా రమాకుమారి, తదితరులు

ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం



ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు దిబ్బపాలెం మైదానంలో ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం ప్రారంభించారు. అదానీ గంగవరం పోర్టు సీఈవో బీజే గాంధీ, ఆర్ఎం డాక్టర్ అనిల్ బాలకృష్ణ, జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

అందరి భాగస్వామ్యంతో ఉక్కు ఉద్యమం



1057వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1057వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థ ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, ఎఫ్ఎండీ ప్లాంట్ డిజైన్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశంలో ఓ గొప్ప అధ్యాయమన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. అమరవీరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి త్యాగానికైనా కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరు సాగిస్తామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్ ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు.

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ

పెదగంట్యాడ: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదవడం, రాయడం అనేవి రెండూ ప్రతి ఒక్కరూ నేర్చుకోగల అత్యంత ఉపయోగకరమైన విషయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంధులు విద్యనభ్యసించేందుకు బ్రెయిలీ లిపి ఎంతో దోహదం చేసిందన్నారు. వైకల్యం మనిషికి మాత్రమేనని, మనసుకు కాదన్నారు. అంగవైకల్యం ఉన్న వారికి మేథోశక్తి బాగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు రవి, జయభారతి, సూర్యనారాయణ, జిలకర్ర రమణ, పావని, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, తదితరులు

కొత్త సీజీఎంకు అభినందనలు



నూతన సీజీఎం సోఫ్తీను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్(వర్క్స్) అజయ్‌కుమార్ సోఫ్తీకి నాన్ జేసీఎం నాయకులు అభినందనలు తెలిపారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను రేటెడ్ కెపాసిటీతో నడిపి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలన్నారు. పని ప్రదేశంలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో నిర్వాసితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక భాగస్వామ్యంతో ప్రగతి సాధ్యమని నమ్ముతున్నామన్నారు. దీనిపై సీజీఎం సోఫ్తీ సానుకూలంగా స్పందిస్తూ ప్లాంట్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.మస్తానప్ప(వైఎస్సార్‌టీయూసీ), వరసాల శ్రీనివాసరావు (జేఎంఎస్), డి.విరమణారెడ్డి(డీవీఆర్‌టీయూసీ), డి.అప్పారావు(హెచ్ఎంఎస్), నమ్మి సింహాద్రి(టీఎన్‌టీయూసీ), అప్పలరాజు(ఐటు), శ్రీనివాసనాయుడు (వీఎస్‌పీఈయూ), టి.జగదీష్(వీఎస్ఎంఎస్), కరణం సత్యారావు, మహాలక్ష్మి నాయుడు, జి.నరేంద్ర, పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సులు నడపాలని వినతి



ఈడీ రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి పరవాడ మీదుగా ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి వరకు సిటీ బస్సుల సౌకర్యం కల్పించాలని ప్రజా రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, రీజినల్ మేనేజర్ అప్పలరాజును దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం అందించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, శీలానగర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రాత్రి పది గంటల వరకు సిటీ బస్సులు నడపాలని, అలాగే రైళ్ల రాకపోకల సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సుల సౌకర్యం కల్పించాలని దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఈశ్వర్ కోరారు.

గోదాదేవికి ఘనంగా కుత్తువిళక్

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కుత్తువిళక్ పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ ఆధ్వర్యంలో గోదాదేవికి పూజలు చేసి హారతి ఇస్తూ పాశుర విన్నపం చేశారు. భక్తులు కూడా దీపాలతో హారతి ఇచ్చి పాశుర విన్నపం చేశారు. అంతకు ముందు తెల్లవారి 4 గంటలకు వెంకటేశ్వరస్వామి, గోదాదేవిలకు సుప్రభాత సేవ, సేవాకాలం కార్యక్రమాలు నిర్వహించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గోదాదేవికి దీపాలతో హారతి ఇస్తున్న భక్తులు

కారుతో వ్యక్తి అదృశ్యం



కింతాడ పృథ్వీ రాజు

అక్కిరెడ్డిపాలెం: ఓ వ్యక్తి కారుతో పాటు అదృశ్యమైన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి సమతానగర్‌లో చోటు చేసుకుంది. గాజువాక హెచ్‌సీ నారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సమతానగర్ వుడా కాలనీలో కింతాడ పృథ్వీరాజు కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈయన డిసెంబర్ 27న ఏపీ 31 సీఈ 306 నంబరు గల కారుతో సహా వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదని అతని బావమరిది సూర్యనారాయణ ఆచారి గాజువాక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. రాజుకు కొద్దిగా అప్పులు ఉన్నాయని, ఆయన రెండు ఫోన్ నంబర్లు స్విచ్ ఆఫ్ అయి ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు హామీకి నిరసనగా నేడు ఆటోల బంద్

గాజువాక: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మహిళలకు ఏపీఎస్ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ హామీ ఇవ్వడాన్ని నిరసిస్తూ గాజువాకలో శుక్రవారం ఆటోల బంద్ నిర్వహించనున్నట్టు గాజువాక ఏరియా ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గొలగాని నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న నిరసనపై పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా సంక్రాంతి ఉచిత బస్సు ప్రయాణాన్ని అనుమతించనున్నట్టు ప్రచారం సాగుతోందని, ఈ రెండు ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌పై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు గాజువాక నుంచి ర్యాలీగా తరలి వెళ్లనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాగు, శ్రీను, అప్పలరెడ్డి, రఫీ, ఖాన్, వెంకట్, మురళీ, రామారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో సంఘం నాయకులు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించి విశేష హారతి అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టంతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి: ధనుర్మాసం సందర్భంగా 85వ వార్డు అగనంపూడిలోని షిర్డిసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పంచామృతాభిషేకం, విభూదిపూజ జరిపారు. తరువాత ఆలయంలో సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ఏసీపీ చుక్కా శ్రీనివాసరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ, పండితులు టి.భానుచందర్, టోపీరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

7న ఉచిత ఆయుర్వేద శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 7న బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పైల్స్, ఫిస్టుల తదితర సమస్యలపై చికిత్స అందించనున్నట్టు పేర్కొన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచిస్తారన్నారు. ఇతర వివరాలకు 94401 91673 నంబరులో సంప్రదించాలన్నారు.

పోర్టు కార్మికులకు బకాయిలు చెల్లించాలి



గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తాతారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పెదగంట్యాడ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ బకాయిల కోసం రోజూ యాజమాన్యం చుట్టూ తిరుగుతున్నామని, అయినా స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వేతన బకాయిలు విడుదల చేయాలని కోరారు. పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.